చదువుకోవడం కష్టం కాదు..

డీఈవో సోమశేఖరశర్మ

మాట్లాడుతున్న డీఈవో సోమశేఖర శర్మ

కూసుమంచి, మార్చి 14: ఇష్టంగా చదివితే.. చదువువుకోవడం ఏమాత్రం కష్టం కాదని జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) సోమశేఖర శర్మ అన్నారు. కూసుమంచి జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు అన్ని విషయాల్లో గతంతో పోలిస్తే ఎంతో మెరుగ్గా ఉన్నాయన్నారు. వెనుకబడిన విద్యార్థులకు వేసవిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. జేవీఆర్ కళాశాల యాజమాన్యం అందించిన పరీక్ష సామగ్రిని పదోతరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ శేఖర్ రెడ్డి అందించారు. హెచ్ఎం వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో రామాచారి, ఎంపీటీసీ మెంబర్ ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లతో వసతుల కల్పన

కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

మామిళ్లగూడెం, మార్చి 14: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు'పై రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో గురువారం హైదరాబాద్ నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ప్రభుత్వ పాఠశాలకూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మెంబర్ కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూలు యూనిఫామ్ కుట్టే బాధ్యతను సైతం స్వశక్తి మహిళా సంఘాలకు కేటాయించినట్లు చెప్పారు. ఈ వీసీలో ఖమ్మం నుంచి కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు సోమశేఖరశర్మ, సన్యాసయ్య, శ్రీనివాస్, సంజయ్‌కుమార్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వీపీ గౌతమ్

'ప్రియదర్శిని' విద్యార్థినులకు ఉచిత శిక్షణ

విద్యార్థినులను అభినందిస్తున్న చైర్మన్ నవీన్‌బాబు

ఖమ్మం రూరల్, మార్చి 14: మండలంలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు 52 మందికి కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు బెంగళూరులోని కొడెస్టు టెక్నాలజీస్ సంస్థ ఎంపిక చేసింది. నాలుగు దఫాలుగా సాగిన ఎంపిక పరీక్షలకు మొత్తం 147 మంది హాజరయ్యారు. వీరిలో 52 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా 'ఏలూరి'

కలెక్టర్ గౌతమ్‌ను కలిసిన ఈడీ ఏలూరి శ్రీనివాసరావు

మామిళ్లగూడెం, మార్చి 14: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఏలూరి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలెక్టరేట్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన ఏలూరి శ్రీనివాసరావును గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులు, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. టీజీవోస్ నాయకులు కాస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, రమేశ్, వల్లోజీ శ్రీనివాసరావు, వెంటపల్లి సత్యనారాయణ, ప్రసన్నకుమార్, శ్రీనివాసరావు, కృష్ణకుమారి, విజయ్‌కుమార్, సాగర్, శారద, గోపి, బట్టు వెంకన్న, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కేరింతలతో సందడి చేసిన విద్యార్థులు

పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 14: విద్యార్థి దశలో కీలకమైన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఇన్నాళ్లూ పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు.. పరీక్షలు ముగియడంతో రెక్కలు వచ్చిన పక్షుల్లా కేరింతలతో సందడి చేశారు. చివరి పరీక్ష రాసి కేంద్రాల్లో నుంచి బయటికి వచ్చిన విద్యార్థులు ఆకాశాన్ని జయించినంత ఆనందంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. తల్లిదండ్రులకు దూరంగా హస్టళ్లలో ఉండి చదువుకున్న విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఇంటిబాట పట్టారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్ అయినట్లు డీఐఈవో రవిబాబు తెలిపారు. గురువారం జరిగిన పరీక్షల్లో 16,000 మందికి 15,526 మంది హాజరై 474 మంది గైర్హాజరైనట్లు వివరించారు. నగరంలోని ఏఎస్ఆర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్ తనిఖీ చేశారు.

జేవీఆర్ డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

క్షేత్ర పర్యటనలో విద్యార్థులు

సత్తుపల్లి టౌన్, మార్చి 14: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన నిమిత్తం జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను జంతుశాస్త్ర అధ్యాపకులు కే రవికుమార్ గురువారం సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. డయాలసిస్ ఇన్‌చార్జి డాక్టర్ వినోద్ కిడ్నీ వ్యాధులు రావడానికి గల కారణాల గురించి వివరించారు. ఏరియా ఆసుపత్రిలో ఉన్న ఐదు డయాలసిస్ మిషన్లు, పనిచేసే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో డయాలసిస్ కేంద్ర ఆడిటర్ సూర్యకుమార్, ఆసుపత్రి సిబ్బంది, డైరీ సైన్స్ అధ్యాపకురాలు ప్రభావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి'

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

రఘునాథపాలెం, మార్చి 14: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని రఘునాథపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు తాతా రఘురాం పేర్కొన్నారు. రఘునాథపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో గురువారం జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థి దశలోనే చదువుపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. చావా బోసుబాబు జ్ఞాపకార్థం ఆతడి కుటుంబీకులు 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ ఆత్కూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనింగ్ శాఖ ఏడీ బదిలీ

మామిళ్లగూడెం, మార్చి 14: జిల్లా భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకుడు సంజయ్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మైనింగ్ ఏడీగా ఉన్న ఆయనను మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పెద్దపల్లి మైనింగ్ ఏడీ సాయినాథను ఖమ్మం జిల్లా ఏడీగా బదిలీ చేశారు. అదేవిధంగా జిల్లా మైనింగ్ శాఖలో సహాయ జియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న గంగాధర్‌ను కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఆ స్థానంలో తాండూర్‌లో మైనింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏ.రమేశ్‌ను నియమించారు. అదేవిధంగా జిల్లా మైనింగ్ విభాగంలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాజిరెడ్డిని మంచిర్యాల జిల్లా మైనింగ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో రాష్ట్ర మైనింగ్ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పీ.నాగరాజును నియమించారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న అధికారులు ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

సత్తుపల్లి టౌన్, మార్చి 14: ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులకు నవచైతన్య సంస్థ ఆధ్వర్యంలో జామెంటరీ బాక్స్, పరీక్ష ప్యాడ్‌లను సేవాసంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె నర్సింహారెడ్డి, తోట కిరణ్ గురువారం విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎంలు నీరుడు నాగేశ్వరరావు, పూరేటి యాకోబు, సంస్థ డైరెక్టర్లు మాదిరాజు పుల్లారావు, గుడిపూడి సుధీర్, గాదె నాగు, బొల్లిపోగు సురేశ్, మైలుమాల ఏసయ్య పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం, మార్చి 14: మండలంలోని బచ్చోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గుతరువారం జరిగింది. పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను జడ్పీటీసీ బెల్లం శ్రీనివాసరావు అందించారు.

ఎర్రుపాలెం, మార్చి 14: మండలంలోని వెంకటాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు, కంపాక్స్‌లను కర్నాటి సుధాకర్‌రెడ్డి అందించారు. దోమందుల సామేలు, వెన్నపూస కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వేపకుంట్ల'లో వైద్య శిబిరం

రఘునాథపాలెం, మార్చి 14: తీవ్రమైన జ్వరాల నేపథ్యంలో మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు మండంలోని వేపకుంట్ల గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు వైద్యాధికారి డాక్టర్ దుర్గాభవని వైద్య పరీక్షలు చేశారు. సూపర్‌వైజర్ జీ.నర్సయ్య, ఏఎన్ఎం పుష్పావతి, ఆశా కార్యకర్తలు ప్రమీల, సునీత తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి బాలుడి ఆత్మహత్య

ఎర్రుపాలెం, మార్చి 14: రైలు కింద పడి బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్దగోపవరం గ్రామానికి చెందిన మందా రాజు(17), తొండలగోపవరం – ఎర్రుపాలెం రైల్వే స్టేషన్ల మధ్య పెగళ్లపాడు రైల్వే ఫ్లైఓవర్‌బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియలేదు. ఖమ్మం జీఆర్‌పీ ఎస్సై పి.భాస్కర్‌రావు కేసు నమోదు చేశారు. మధిర జీఆర్‌పీ ఇన్‌చార్జ్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిరుమలాయపాలెం, మార్చి 14: మండలంలోని ఎర్రగడ్డ, గోపాలపురంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం జడ్పీటీసీ సభ్యుడు బెల్లం శ్రీనివాసరావు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ గడ్డికొప్పుల రాజు, గ్రామ పెద్దలు బెల్లం చలపతిరావు, చింతలపుడి రాము, బెల్లం విజయ్, గద్దల వెంకటయ్య, గుండమళ్ల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముదిగొండ, మార్చి 14: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. ముదిగొండ శివారులో హైవే నిర్మాణం కోసం కంకర ప్లాంట్ ఏర్పాటైంది. దాని ఆవరణలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉండడాన్ని చూసిన వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు పరీక్షగా చూసేసరికి అతడు మృతిచెంది ఉన్నాడు. అతడి జేబులోని ఐడీ కార్డులు, సెల్‌ఫోన్ ఆధారంగా.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ క్లీనర్ మహ్మద్ సలీం(63)గా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం నిమిత్తం ఖమ్మం ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసును ఎస్సై నరేష్ దర్యాప్తు చేస్తున్నారు.

'రైతుల రుణ మాఫీ ఎగవేతకు యత్నం'

మధిర, మార్చి 14: రైతుల వ్యవసాయ రుణ మాఫీ హామీని అమలు చేయకుండా ఎగవేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం మధిరలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రమాణ స్వీకారం రోజే రూ.2లక్షల రుణాలు మాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. నాయకులు ఏలూరి నాగేశ్వరరావు, చిలివేరు సాంబశివరావు, బాపట్ల రమేష్, గూడ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపేందర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడు బడిలో గ్రామస్తుల శ్రమదానం

తిరుమలాయపాలెం, మార్చి 14: మండలంలోని బచ్చోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు కొందరు గురువారం శ్రమదానం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించి, మరుగుదొడ్లను శుభ్రం చేశారు. గ్రామ పెద్దలు తిమ్మిడి హనుమంతరావు, గండమాల ఉపేందర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

18న మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక

మధిర రూరల్, మార్చి 14: మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక ఈ నెల 18న మండల పరిషత్ కార్యాలయంలో ఉంటుందని తహసీల్దార్ వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఫారం–3లో నామినేషన్ పత్రాలను 18న ఉదయం 10 గంటల లోపు మండల ప్రిసైడింగ్ అధికారికి ఇవ్వాలన్నారు.

మధిరలో రెండుచోట్ల చోరీలు

మధిర, మార్చి 14: మధిర పట్టణంలో రెండుచోట్ల గురువారం రాత్రి చోరీలు జరిగాయి. సుందరయ్య నగర్‌లోని మహేష్ ఇంట్లో బంగారం, నగదు చోరీ చేశారు. అంబేద్కర్ సెంటర్‌లోని ప్రభంజన్ మెడికల్ షాపులో కూడా చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదుతో ఇంటిని, షాపునను పట్టణ ఎస్సై సంధ్య పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

మధిర, మార్చి 14: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత గురువారం పంపిణీ చేశారు. తహసీల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ మెండెం లలిత, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఎండీ షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజీలకు రాయితీపై సోలార్ విద్యుత్ సౌకర్యం

ఖమ్మం వ్యవసాయం, మార్చి 14: కోల్డ్ చైన్ పథకం ద్వారా కోల్డ్ స్టోరేజీలకు రాయితీపై సోలార్ విద్యుత్ సిస్టమ్‌ను అందజేయనున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి బీవీ రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద 35 శాతం రాయితీ అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన యజమానులు ఈ నెల 18లోపు జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

ఇసుక రవాణా కేసులో పోలీసు కస్టడీకి 'వాసు'

మామిళ్లగూడెం, మార్చి 14: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బోయపాటి వాసును ఇటీవల ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం జిల్లా జైలులో 14 రోజుల రిమాండ్‌లో ఉన్న వాసును మరింత విచారణ నిమిత్తం గురువారం ఒక్క రోజు కస్టడీకి తీసుకున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, మార్చి 14: మండలంలోని తుమ్మలపల్లి, కొండ్రుపాడు, కుప్పెనగుంట్ల, టేకులపల్లి, రామచంద్రరావుబంజర గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే మట్టా రాగమయి శంకుస్థాన చేశారు. అధికారులు, నాయకులు బుక్కా కృష్ణవేణి, కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, కరిముల్లా, ఏడా కమలాకర్‌రావు, చీకటి చిన్ననర్సింహారావు పాల్గొన్నారు.

రాజసాయిమందిరంలో అన్నదానం

పెనుబల్లి, మార్చి 14: మండలంలోని వీఎం బంజరలో లోని శ్రీరాజసాయి మందిరంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు ఎవరైనా ముందుకు వస్తే ఆలయ కమిటీ నిర్వాహకులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జన్నారెడ్డి విజయ, ఉమారాణి, భీమిరెడ్డి శ్యామల, బేబి పాల్గొన్నారు.

తాళ్ల పెంట పాఠశాల వార్షికోత్సవం

పెనుబల్లి, మార్చి 14: మండలంలోని తాళ్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదోతరగతి వీడ్కోలు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. చదువుల్లో, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పూర్వవిద్యార్థులు టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని అందజేశారు. అనంతరం విద్యార్థులు పలుసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో దుప్పికి గాయాలు

సత్తుపల్లి రూరల్, మార్చి 14: వీధికుక్కల దాడిలో దుప్పికి తీవ్రగాయాలైన ఘటన గురువారం సత్తుపల్లిలో చోటుచేసుకున్నది. సత్తుపల్లి డీఆర్‌వో ముత్యాలరావు కథనం ప్రకారం..వేంసూరు రోడ్‌లోని నీలాద్రి అర్బన్‌పార్కులో దుప్పిపై వీధి కుక్కలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు సిద్ధారంరోడ్‌లోని పశువైద్యశాలకు తరలించగా వైద్యులు ప్రదీప్‌కుమార్ చికిత్స చేశారు.

శ్రీలేఖకు ఆర్థికసాయం

సత్తుపల్లి, మార్చి 14: యువసేవ సేవాసమితి ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాధు శ్రీలేఖకు వైద్యఖర్చుల నిమిత్తం తండ్రి భిక్షమయ్యకు సీఐ కిరణ్ చేతులమీదుగా యువసేవ సేవాసమితి నిర్వాహకులు రూ.54,641 గురువారం అందజేశారు. జొన్నగట్ల రాజు, ఈదుల, షేక్ ఇమ్రాన్, మల్లెల వెంకన్న, పూర్ణకంటి శ్యామ్, పూల మధు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు బల్లల వితరణ

వైరారూరల్, మార్చి 14: మండల పరిధిలోని స్నానాల లక్ష్మీపురం పాఠశాలకు గురువారం లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ సహకారంతో గ్రామస్తులు దొడ్డా పుల్లయ్య తల్లి సుశీల జ్ఞాపకార్థం రూ.40వేలు విలువ కలిగిన బల్లలను అందజేశారు. జి.నాగేశ్వరరావు, వెలిశెట్టి నర్సింహారావు, అబ్బూరి రమేష్, చింతలపూడి వెంకటేశ్వరరావు, అమ్మిక రామారావు, మల్లు రామకృష్ణ, బొల్లం శ్రీనివాసరావు, నూతి వెంకటేశ్వరరావు, భారతి, చింతోజు నాగేశ్వరరావు, వై.బుచ్చిరామారావు పాల్గొన్నారు.

మారెమ్మతల్లి ఆలయ కమిటీకి సన్మానం

వేంసూరు, మార్చి14: మండలంలోని కుంచపర్తిలోని శ్రీమారెమ్మతల్లి ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన జమ్ముల కోటిస్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఇజ్జిగాని జయలక్ష్మి, దాయక రామారావు, నరేడ్ల దయాకర్‌రెడ్డి, చిమట కేశవరావు, పరిగడుపు కిరణ్‌బాబు, ఇజ్జిగాని శ్రీరాములును గురువారం ఆలయంలో కాంగ్రెస్ నాయకకుడు డాక్టర్ మట్టా దయానంద్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతి ఉత్సవం

మొల్ల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొణిజర్ల, మార్చి14: మండలంలోని తుమ్మలపల్లి, తనికెళ్ల గ్రామాల్లో ఆత్కూరి మొల్ల మాంబ జయంతి ఉత్సవాలను దును కు వేలాద్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. వనజీవి రామయ్య, దండు హుస్సేన్, రామారావు, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీజీపీఏ కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం, మార్చి 14: తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్(టీజీపీఏ) మండల కమిటీని గురువారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా గూడేటి బాబురావు, ప్రధాన కార్యదర్శిగా ఇనుపనూరి రవికుమార్, కోశాధికారిగా నండ్రు రాజారావు, వైస్ ప్రెసిడెంట్లుగా జ్వాల సురేష్, ఐ.కళ్యాణి, జాయింట్ సెక్రటరీలుగా సంగెపు అనిల్‌కుమార్, వాడవల్లి మౌనిక, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సగ్గర్తి మోహన్‌రావు, అధికార ప్రతినిధిగా సగ్గర్తి ముత్యాలరావు, సెక్రటరీగా నండ్రు వెంకటరత్నం ఎన్నికయ్యారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి కోట లోకేష్, ఖమ్మం జిల్లాఅధ్యక్షుడు గొల్ల మండల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

శ్రీచైతన్య కళాశాలలో రక్తదాన శిబిరం

ఖమ్మం రూరల్, మార్చి 14: మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 'శ్రీచైతన్య మహోత్సవ్'లో భాగంగా నిర్వాహకులు గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని కళాశాల చైర్మన్ మల్లెపాటి శ్రీధర్, డైరక్టర్ శ్రీవిద్య, మెడికల్ కళాశాల సంచాలకుడు డాక్టర్ కుమార్ ప్రారంభించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి గీతిక, ప్రిన్సిపాల్ పన్నాల కృష్ణమూర్తి, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బ్లడ్ బ్యాంక్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలు, కళాశాల సీఈవో శ్రీనివాస్, ఏవో వైశాలి. వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ వి.సుదర్శన్, కృష్ణప్రసాద్, హరప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.850 కోట్లు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వ్యాప్తంగా 31 రాష్ట్ర రహదారుల విస్తరణ, ఆధునికీకరణ పనుల కోసం కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ రూ.850 కోట్లు మంజూరు చేసింది. సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఎఫ్ఐ)లో భాగంగా ఈ నిధులను కేటాయించింది. నిధులతో 435.29 కిలోమీటర్ల మేర రహదారుల విస్తరణతో పాటు ఇతర పనులు జరుగనున్నాయి. నిధుల విడుదల గురించి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. సత్తుపల్లిలో చిన్నకోరుకొండి– ఆర్లపాడు రోడ్డు, తల్లాడ–కొండవీటిమెట్ట వయా నారాయణపురం, కలకొడిమ– వెంకటాపురం రోడ్డు వయా బస్వాపురం మధ్య రహదారులు అందుబాటులోకి రానున్నాయి. అలాగే ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని నూతనకల్లు– గూడూరు రోడ్డు, లోకవరం–పెనుబల్లి రోడ్డు మధ్య వంతెనల నిర్మాణం జరుగనున్నది.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **దుబాకుల ప్రదీప్**, S/o : నర్సయ్య, **వయస్సు** : 48 సం॥లు, **వృత్తి** : వ్యాపారం, **నివాసం** : తిమ్మక్కపేట గ్రామం, తిరుమలాయపాలెం మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదర